
సాక్షి
బాపట్ల
గురువారం । 26 । అక్టోబర్ । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 525.30 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



చెరువులకు జలకళ

దాచేపల్లి : తాగునీటి చెరువులు జలకళ సంతరించుకున్నాయి. ముత్యాలంపాడు, సారంగపల్లి అగ్రహారం చెరువులకు తంగెడ మేజర్ కాలువల ద్వారా నీటిని విడుదల చేశారు.



కార్తికేయునికి వెండి ఊయల

మోపిదేవి: శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి భక్తులు 2.30 కిలోల వెండి ఊయల సహా రూ.2.24 లక్షల విలువగల వెండి వస్తువులు సమర్పించుకున్నారు.


రైతు శ్రేయస్సుకు ప్రాధాన్యం

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

- పౌరసరఫరాల శాఖ సమాయత్తం
- జిల్లాలో 78,330 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- 153 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు రంగంసిద్ధం
- కొనుగోళ్లపై ఆర్‌బీకే సిబ్బందికి శిక్షణ

ఖరీఫ్‌లో ఇలా..

వరి పంట సాగు విస్తీర్ణం(హెక్టార్లలో) : 82,000



ధాన్యం సేకరిస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షి ప్రతినిధి,బాపట్ల: రైతుల శ్రేయస్సు దృష్ట్యా ధాన్యం సేకరణకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీచేసింది. ఫలితంగా జిల్లాలో ధాన్యం సేకరణకు జిల్లా పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ధాన్యం సేకరణ ప్రక్రియపై అధికారులు, సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆ తరువాత ధాన్యం సేకరణ ప్రారంభం కానుంది. ఈ ఏడాది 78,330 మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కొలువుదీరాక ఏటా ప్రభుత్వం పంటలకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో కర్షకుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్బీకేల ద్వారా ధాన్యం సేకరణ

ఈ ఏడాది 153 ఆర్‌బీకేల ద్వారా 78,330 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి పౌరసరఫరాల శాఖ అధికారులు సేకరించనున్నారు. దీనికోసం 10 లక్షల గోనె సంచులు అవసరం కాగా ఇప్పటి వరకు 3 లక్షల సంచులను సిద్ధం చేశారు. మిగిలినవి త్వరలోనే సమకూర్చనున్నారు. కొనుగోళ్ల కోసం ప్రతి ఆర్బీకే పరిధిలో డేటా ఎంట్రీ ఆపరేటర్(డీఈఓ), టెక్నికల్ అసిస్టెంట్, హెల్పర్‌తో కలిపి ముగ్గురు సిబ్బందిని ఇప్పటికే నియమించారు. వీరందరికీ ధాన్యం కొనుగోలుపై శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే డీఈఓలకు శిక్షణ పూర్తయింది.

ధాన్యం రవాణా వాహనాలకు జీపీఎస్

ధాన్యం సేకరణలో భాగంగా గత ఏడాది 150 రవాణా వాహనాలకు జీపీఎస్ డివైజ్‌లు ఏర్పాటు చేయగా ఈ సీజన్‌లో 200 డివైజ్‌లు సిద్ధం చేశారు. గతంలో క్వింటాలు ధాన్యానికి రూ.2,060 మద్దతు ధరగా చెల్లించగా ఈ ఏడాది దీనిని రూ.2,203కు పెంచారు.

దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నుల్లో)	
మొత్తం దిగుబడి	: 5,33,000
బీపీటీ 5204, 2672	: 2,83,000
ఎంటీయు రకాలు	: 2,50,000
ధాన్యం సేకరణ లక్ష్యం	: 78,330 (మెట్రిక్ టన్నులు)

ధాన్యం కొనుగోలుకు పూర్తిస్థాయి ఏర్పాట్లు



ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ధాన్యం సేకరణకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించనున్నాం. 153 ఆర్బీకేల పరిధిలో ధాన్యం సేకరణ ఉంటుంది. ఇందుకోసం అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇస్తున్నాం. శిక్షణా కార్యక్రమాలు పూర్తయ్యాక మద్దతు ధరకు ధాన్యాన్ని రైతుల నుంచి సేకరిస్తాం.

– శ్రీలక్ష్మి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్, బాపట్ల



వెల్లటూరులో ఏకలవ్యుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నాగార్జున

ఏకలవ్యుడు గొప్ప శిష్యుడు

- మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- వెల్లటూరులో అట్టహాసంగా ఏకలవ్యుడి విగ్రహావిష్కరణ

వెల్లటూరు(భట్టిప్రోలు): గురుభక్తిని చాటిన గొప్ప శిష్యుడు ఏకలవ్యుడని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున చెప్పారు. వెల్లటూరు లాక్ సెంటర్‌లో గిరిజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏకలవ్య విగ్రహ ఆవిష్కరణ బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ విలువిద్యను అభ్యసించాలనే ఆసక్తితో ఏకలవ్య ద్రోణుడిని ఆశ్రయించగా తిరస్కరించడంతో బంక మట్టితో గురువు విగ్రహాన్ని ప్రతిష్ఠించి స్వాధ్యయనం ద్వారా విద్య పొందిన మహోన్నత వ్యక్తి ఏకలవ్యుడు అని కొనియాడారు. గ్రామస్తులు ఒకే మాటతో కట్టుబడి విగ్రహం ఏర్పాటు చేయడం శుభ పరిణామమని, గిరిజన సంఘాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి చెప్పారు. అనంతరం అన్నదానం జరిగింది. కార్యక్రమానికి గ్రేస్ ఫౌండేషన్ చైర్మన్ కైతేపల్లి షాలేమ్ రాజు సహకారం అందించారు.

ఆకట్టుకున్న కర్రసాధనం, కోలాటం

అనంతరం భట్టిప్రోలుకు చెందిన వారు ప్రదర్శించిన కర్ర సాధనం, వెల్లటూరు వారి కోలాట నృత్యం స్థానికులను ఆకట్టుకుంది. సోది చెప్పుట, ఈత బుట్టల అల్లిక కార్యక్రమాలూ జరిగాయి. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ (బౌడా) దేవినేని మల్లికార్జునరావు, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, సర్పంచ్ చౌటూరి లక్ష్మి, శ్రీకట్లమ్మ తల్లి ఏకలవ్య సంఘం నిర్వాహకులు బొడ్డు ఆంజనేయులు, కట్టా పిచ్చయ్య, బొడ్డు శ్రీను, బొడ్డు పోతురాజు, కట్టా సుబ్బులమ్మ, గిరిజన ఐక్యవేదిక ఏపీ, తెలంగాణ కన్వీనర్ ఊసవరపు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు బొడ్డు బసవకోటేశ్వరరావు, బొడ్డు వెంకటేశ్వరరావు, అమృతలూరు వైస్ ఎంపీపీ దేవరకొండ సత్యవతి, ఏఎస్ఐ కట్టా వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు కట్టా రవి, ప్రధాన కార్యదర్శి కట్టా గురుకిరణ్, వెల్లటూరు గ్రామ పెద్దలు కాట్రగడ్డ గోపాల్, మోటూరు చౌదరి, మోటూరు పుణ్య శ్రీనివాసరావు(చినబాబు), నాదెళ్ల శివాజీ, చౌటూరి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం’ కోసం దరఖాస్తుల ఆహ్వానం


బాపట్ల అర్బన్: ప్రభుత్వం జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం పథకాన్ని ప్రవేశపెట్టిందని ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి జె.రాజాదేబోర బుధవారం తెలిపారు. ఈ పథకం ద్వారా 2023లో యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థులకు రూ.లక్ష నగదు ప్రోత్సాహకం అందిస్తున్నట్లు వెల్లడించారు. మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధిస్తే రూ.50వేలు అందిస్తారని వివరించారు. ప్రోత్సాహకాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు జ్ఞానభూమి.ఏపీ.జీవోవీ.ఇన్ పోర్టల్లో అందించిన వెబ్ లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను నమోదు చేసుకోవడానికి నవంబర్ 4 చివరి తేదీ అని వెల్లడించారు.

రేపు జగనన్నకు చెబుదాం

రేపల్లె రూరల్: పట్టణంలోని పత్తిపాటి సీతారామ యోగిని కల్యాణ మండపంలో ఈనెల 27వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి కలెక్టర్ రంజిత్‌బాషా ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ శివపార్వతి తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు, మండలస్థాయి అధికారులు పాల్గొని సమస్యలతో కూడిన అర్జీలను స్వీకరిస్తారని వివరించారు.

న్యూస్‌రీల్

అమరావతిలో ముగిసిన దసరా ఉత్సవాలు



అమరావతి: బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాలు బుధవారం పూర్ణాహుతితో ముగిశాయి. తొలుత చండీదేవి సమేత అమరేశ్వరస్వామికి నంది మండపంలో చూర్ణోత్సవం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు తిరువంజనం చేసి నూతన వస్త్రాలంకరణతో వసంతోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ మాట్లాడుతూ దసరా ఉత్సవాలలో చండీకల్యాణం అనంతరం స్వామికి చూర్ణోత్సవం, వసంతోత్సవం నిర్వహించటం ఆనవాయితీగా వస్తోందన్నారు. పూర్ణాహుతి కార్యక్రమం, పంచాహ్నిక దీక్షతో దసరా ఉత్సవాలు ముగిశాయని పేర్కొన్నారు. రాత్రి 10 గంటలకు నిర్వహించే ధ్వజావరోహణ కార్యక్రమంతో స్వామి ఏకాంతసేవా మహోత్సవాలు ప్రారంభమవుతాయని వివరించారు. వసంతోత్సవం అనంతరం స్వామికి పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలలో ఆలయ ఈఓ వేమూరి గోపీనాథశర్మ పాల్గొన్నారు.


26 నుంచి నవంబర్ 2 వరకు రైళ్లు ఆగవు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): నరసరావుపేట రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న డబ్లింగ్ పనుల నేపథ్యంలో ఆ స్టేషన్‌లో ఈనెల 26వ తేదీ నుంచి నవంబర్ 2 వరకు రైళ్లు ఆగవని గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్ కుమార్ బుధవారం తెలిపారు. గుంటూరు డివిజన్ పరిధిలోని సాతులూరు–నరసరావుపేట–మునుమాక స్టేషన్ల మధ్య డబ్లింగ్ పనుల్లో భాగంగా ప్రీ ఎన్ఐ, నాన్ ఇంటర్ లాకింగ్ బ్లాక్ పనులు జరుగుతున్నాయని వివరించారు. రైలు ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.

రేపు నిధి ఆప్‌కే నికత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని భవిష్యనిధి (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 27న నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీఎఫ్ పరిధిలోకి వచ్చే యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లు ఈనెల 27న ఉదయం 9.30 గంటలకు ఆయా జిల్లాల్లో నిర్వహిస్తున్న నిధి ఆప్‌కే నికత్‌లో పాల్గొని తమ సమస్యలు, ఫిర్యాదులను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. గుంటూరు జిల్లా పరిధిలో ప్రత్తిపాడురోడ్డులోని మలినేని ఇంజినీరింగ్ కళాశాల, కృష్ణాజిల్లా బాపులపాడులోని దీపక్ నెక్స్‌జెన్, ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలోని కృష్ణవేణి స్కూల్, ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని వర్సిటీ ఎడ్యుకేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సొసైటీ, ఇబ్రహీంపట్నంలోని ఫ్యాబెక్స్ స్టీల్ స్ట్రక్చర్స్ ప్రైవేటు లిమిటెడ్, బాపట్ల జిల్లా చీరాలలోని కోరమాండల్ ఆగ్రో ప్రోడక్ట్స్ అండ్ ఆయిల్స్, పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పెదగార్లపూడిలోని చెట్టినాడ్ సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేటు లిమిటెడ్‌లో సమావేశాలు జరుగుతాయని వివరించారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 4,012 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 186, బ్యాంక్ కెనాల్‌కు 1,076, తూర్పు కెనాల్‌కు 253, పశ్చిమ కెనాల్‌కు 140, నిజాంపట్నం కాలువకు 260, కొమ్మమూరు కాల్వకు 1,410 క్యూసెక్కులు విడుదల చేశారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌లో బుధవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.2,800, గరిష్ట ధర రూ.4,000, మోడల్ ధర రూ.3,300 వరకు పలికింది.

వారాబందీతో చివరి భూములకూ సాగునీరు

కలెక్టర్ రంజిత్ బాషా

బాపట్ల: వారాబందీ విధానంతో ఆయకట్టు చివరి భూములకూ నీరందించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. జలవనరుల శాఖ, అనుబంధ శాఖల అధికారులతో బుధవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో ఆయన సమీక్ష నిర్వహించారు. కృష్ణా పశ్చిమ డెల్టా ద్వారా విడుదలవుతున్న నీటిని సద్వినియోగం చేసుకునేలా అధికారులు ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. కృష్ణా పశ్చిమ డెల్టా ద్వారా బాపట్ల జిల్లాలో 3.84 లక్షల ఎకరాల ఆయకట్టు భూమి సాగులో ఉందన్నారు. ప్రస్తుతం నాలుగు వేల క్యూసెక్కుల నీరు వారాబందీ విధానంలో గుంటూరు, బాపట్ల జిల్లాలకు విడుదలైనట్లు వెల్లడించారు. గుంటూరుకు 5 రోజులు, బాపట్ల జిల్లాకు 5 రోజుల చొప్పున నీరు వస్తుందని పేర్కొన్నారు. నిజాంపట్నం కెనాల్ ద్వారా 70 వేల ఎకరాలకు నీరందాలంటే పిట్టలవానిపాలెం వద్ద నుంచే వారాబందీ విధానం చేపట్టాలన్నారు. చీరాల కెనాల్ ద్వారా 72,180 ఎకరాల్లో ఆరుతడి పంటలకైనా నీరందేలా చూడాలన్నారు.

కాలువల్లో పూడిక తీత పనులపై కలెక్టర్ ఆగ్రహం

సాగు నీటి కాల్వల పూడికతీత, మరమ్మతు పనులు జలవనరులశాఖ పరిధిలో జరుగుతున్నాయని కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. దీనికోసం జిల్లాకు ప్రభుత్వం రూ.4.6 కోట్ల నిధులను కేటాయించిందని వివరించారు 66 పనుల్లో 45 పనులు పురోగతిలో ఉండగా, మరో 14 పనులు టెండర్ దశలో ఉన్నాయని వెల్లడించారు. మిగిలినవి మొదలు పెట్టలేదన్నారు. వేమూరు చానల్లో 20 పనులు, బాపట్ల చానల్లో 18 పనులు, పర్చూరు చానల్లో 10 పనులు, కొల్లూరు, భట్టిప్రోలు కాల్వల పనులపై మండలాల వారీగా కలెక్టర్ సమీక్షించారు. అధికారిక అనుమతులు వచ్చిన తదుపరి టెండర్ల ప్రక్రియ 3 నెలల క్రితమే పూర్తయినా కనీసం 50 శాతం పురోగతి సాధించకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



జలవనరులశాఖ, అనుబంధ శాఖలతో సమీక్షిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

ముందస్తుగా వచ్చే సంవత్సరం ప్రణాళిక

ప్రస్తుత అనుభవాల దృష్ట్యా 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సాగునీటి కాల్వల పూడికతీత, మరమ్మతు పనులపై వార్షిక ప్రణాళికను ముందస్తుగానే రూపొందించామని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. జిల్లావ్యాప్తంగా 128 పనులు చేయడానికి ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలిపారు. ఇందుకోసం రూ.12.82 కోట్ల నిధులు అవసరం కానున్నాయని అంచనాలు వేశామన్నారు. వెంటనే ప్రభుత్వానికి ఈ ప్రతిపాదనలు పంపుతామన్నారు. వచ్చే సంవత్సరం సాగునీరు విడుదలకు ముందుగానే పూడిక తీత, మరమ్మతులు చేస్తామన్నారు. ఏపీఎస్ఐడీసీ ద్వారా ఎత్తిపోతల పథకాల నిర్వహణకు అన్నిచర్యలూ తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. సమావేశంలో జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ బి.మురళీకృష్ణ, కృష్ణా పశ్చిమ డెల్టా ఈఈ మల్లికార్జున్, పంట కాల్వల ఈఈ వెంకటరత్నం, ఏపీడబ్ల్యూఐడీసీ ఈఈ హజరతయ్య, గుంటూరు ఈఈ ఎస్.కె.వి.ప్రసాద్, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలపై సమీక్ష

సంక్షిప్త ఓటర్ల సవరణ జాబితా తయారీకి రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్లో సమావేశం నిర్వహించారు. ఓటర్ల పేర్లు, చిరునామాల మార్పులు, చేర్పుల ప్రక్రియ పారదర్శకంగా సాగుతోందని చెప్పారు. దీనికి రాజకీయ నాయకులు సహకారం అందించాలన్నారు. పెండింగ్ దరఖాస్తులన్నీ పరిష్కరిస్తున్నామన్నారు. ఈవీఎం యంత్రాల పరిశీలన త్వరలో ముగుస్తుందన్నారు. సమావేశంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మల్లికార్జున్, కృష్ణ కాంత్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

నరసరావుపేట రూరల్: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఆధ్వర్యంలో జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై బుధవారం జేసీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలోని ఏడు జిన్నింగ్ మిల్లులు, ఏడు మార్కెట్ యార్డులను గుర్తించి పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. నవంబర్ 1 నుంచి రైతులు ఆర్‌బీకేల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.7,020గా నిర్ణయించినట్టు వెల్లడించారు. పత్తి కొనుగోలు కేంద్రాల వద్దకు దళారులు వస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నాణ్యత ప్రమాణాల పోస్టర్‌లను అన్ని కొనుగోలు కేంద్రాలు, ఆర్‌బీకేల వద్ద ఏర్పాటు చేయాలని అధికారులను జేసీ ఆదేశించారు. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కె.సూర్యప్రకాష్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మురళి, జిల్లా రవాణా శాఖ అధికారి పరంధామరెడ్డి పాల్గొన్నారు.

చేసింది చెప్పడం కోసమే సామాజిక బస్సు యాత్ర

మార్కెటింగ్ కో–ఆపరేటివ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి



పర్చూరు (చినగంజాం): అట్టడుగు వర్గాలను ఆర్థిక, సాంఘిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి పథంలో తమ ప్రభుత్వం నడిపించిన వైనాన్ని ప్రజలకు తెలియజెప్పడం కోసమే గురువారం నుంచి సామాజిక సాధికార బస్సు యాత్రను ప్రారంభిస్తున్నట్లు మార్కెటింగ్ కో–ఆపరేటివ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి చెప్పారు. నూతలపాడులోని ఆత్రేయ వృద్ధాశ్రమం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ మొదలు శాసన సభ, మండలి వరకు నిర్దేశించిన లక్ష్యాలకు మించి వైఎస్సార్ సీపీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు అధికారంలో సింహభాగం అవకాశాలు కల్పించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. దశాబ్దాల తరబడి అధికారానికి ఆమడ దూరంలో ఉంటూ ఆత్మన్యూనతా భావంతో బతుకులు వెళ్లదీస్తున్న బీసీలు, మోస్ట్ బ్యాక్‌వర్డ్ బీసీల (ఎంబీసీలు)ను 56 కార్పొరేషన్లుగా ఏర్పాటు చేసి 720 మందిని డైరెక్టర్లుగా అవకాశం కల్పించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. ఇటీవల పార్లమెంట్‌లో ఆమోదం పొందిన మహిళా బిల్లుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండేళ్ల క్రితమే శాసన సభలో ఆమోదింపజేసి కేంద్రానికి పంపిన విషయం నిజం కాదా? అని ఆయన ప్రశ్నించారు. మేనిఫెస్టోలోని 98 శాతంపైగా హామీలు పూర్తి చేస్తే అందులో లబ్ధిదారులు జనాభాలో 60 శాతంపైగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలేనన్నారు. తమ పార్టీకి బీసీలే వెన్నెముక అని, తన ఎల్లో మీడియా ద్వారా ఉత్తర ప్రగల్భాలు పలికిన మాజీ సీఎం చంద్రబాబు అండ్ కో ఆచరణలో బీసీలకు రిక్త హస్తం చూపటం ఆయా వర్గాలు మరచిపోలేదని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వంలో లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములు, చుక్కల భూముల పరిష్కారం వల్ల లబ్ధి పొందిన వారూ బడుగు, బలహీన వర్గాలేనని బత్తుల స్పష్టం చేశారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన జగనన్న సురక్ష, ఆరోగ్య సురక్ష పథకాలు రాష్ట్రంలో విప్లవాత్మక చర్యలు అని కొనియాడారు. రాష్ట్రంలో 32 లక్షల మందికి ఇళ్ళ స్థలపట్టాలు వాటిలో 22.50 లక్షలు గృహ నిర్మాణాలు, 7.50 లక్షల గృహ ప్రవేశాలు నభూతోన భవిష్యతి అని అన్నారు. ప్రజలు గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వ పనితీరుకు మధ్య వ్యత్యాసాన్ని గుర్తించి మరోసారి వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని కోరారు. గురువారం నుంచి డిసెంబర్ 31 వరకు 60 రోజుల పాటు రాష్ట్రంలో నిర్వహించనున్న సామాజిక సాధికారత బస్సు యాత్రను ప్రజలు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు భవనం రాజగోపాలరెడ్డి, గోగినేని బుల్లిబ్బాయి, బెజవాడ స్వామి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాటి ఏడుకొండలు, బడే శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైకు ఢీకొని వృద్ధుడు మృతి

కర్లపాలెం: సైకిల్‌పై వెళుతున్న వృద్ధుడిని ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనటంతో తీవ్ర గాయాల పాలై మృతిచెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. కర్లపాలెం ఏఎస్‌ఐ సాంబశివరావు తెలిపిన వివరాల ప్రకారం కర్లపాలెం మండల పరిధిలోని దుండివారిపాలెం గ్రామానికి చెందిన మరుప్రోలు దశరథరామిరెడ్డి(70) సైకిల్‌పై కర్లపాలెం వస్తుండగా తుంగభద్ర వంతెన దాటిన తరువాత కర్లపాలెం నుంచి బుద్దాం వైపు వెళుతున్న ద్విచక్ర మోటారు వాహనం సైకిల్‌ను ఢీకొనటంతో దశరథరామిరెడ్డి కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రున్ని తొలుత బాపట్ల ఏరియా వైద్యశాలకు అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడని ఏఎస్‌ఐ తెలిపారు. మృతుని కుమారుడు శ్రీనివాసరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ తెలిపారు.

ఎయిమ్స్‌లో కార్డియాక్ విభాగం

మంగళగిరి: నగరంలోని ఆల్ ఇండియా మెడికల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్(ఎయిమ్స్)లో అన్ని రకాల జబ్బులకు వైద్యం అందుబాటులోకి వచ్చింది. ఇప్పటి వరకు అన్ని రకాల వ్యాధులకు చికిత్స లభిస్తున్నా గుండెజబ్బులకు సంబంధించి విభాగం లేకపోవడంతో గుండెజబ్బులకు పూర్తి స్థాయిలో చికిత్స అందించలేకపోకపోతున్నారు. బుధవారం నుంచి గుండె జబ్బులకు ఎయిమ్స్‌లో చికిత్స అందించనున్నట్లు అందుకొరకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసినట్లు ఎయిమ్స్ డైరెక్టర్ ముఖేష్ త్రిపాఠి తెలిపారు. దీంతో ఎయిమ్స్‌లో అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, ఔట్ పేషంట్, ఇన్ పేషంట్‌లు అందరికి 24 గంటలు చికిత్స అందుబాటులోకి రావడం జరిగిందన్నారు. రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు వైద్యులతో పాటు సిబ్బందిని నియమించడం జరిగిందని వివరించారు. ఎయిమ్స్ వచ్చే రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలతో పాటు చికిత్స అందించడం జరుగుతుందని చెప్పారు. మందులు అతి తక్కువ ధరలకే అందిస్తున్నామని ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి రోజు మూడు వేల మందికిపైగా రోగులు వస్తున్నారన్నారు.

భర్తకు తెలియకుండా విదేశాలకు భార్య

మనస్థాపంతో భర్త ఆత్మహత్య



మృతుడు ఆలూరి సార్వభౌమ (ఫైల్)

కొల్లూరు: భార్య, భర్తల నడుమ స్వల్ప వివాదాలు జరుగుతున్న నేపథ్యంలో భర్తకు తెలియకుండా భార్య విదేశానికి వెళ్లిపోవడంతో మనస్థాపానికి గురైన భర్త ఉరి పెట్టుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఈపూరుకు చెందిన ఆలూరి సార్వభౌమ (31)కు మూడేళ్ల క్రితం చెరుకుపల్లి మండలం గూడవల్లికి చెందిన పూర్ణిమ అనే యువతితో వివాహం జరిగింది. హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగాలు చేసుకుంటూ జీవిస్తున్న దంపతుల నడుమ గత కొద్ది నెలలుగా మనస్పర్ధలు చోటుచేసుకున్నాయి. అప్పట్నుంచి సార్వభౌమ ఈపూరులో తన గృహ నిర్మాణ పనులు చూసుకుంటూ ఇంటి వద్ద నుంచే ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. పెద్దలు ఇరువురి నడుమ సయోధ్య కుదిర్చేందుకు ప్రయత్నించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. అయితే ఇటీవల తన భార్య ఫోన్‌లలో సైతం స్పందించక పోవడంతో ఆమె సమాచారం తెలుసుకునేందుకు తన అత్తగారి ఇంటికి మృతుడు వెళ్లగా సరైన సమాధానం లభించలేదు. ఇటీవల తన భార్య తనకు చెప్పకుండా లండన్ వెళ్లినట్లు తెలుసుకున్న సార్వభౌమ మనస్థాపంతో బాధపడుతున్నాడు. బుధవారం తెల్లవారుజామున అతని తల్లి నిద్రలేచి రోజువారి పనులు చేసుకునేందుకు బయటకు వచ్చిన క్రమంలో డాబా మెట్ల వద్ద ఉన్న సిమెంట్ పిల్లరుకు ఉరి పెట్టుకుని వేలాడుతూ ఉండటం గమనించి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి ఉరి నుంచి తప్పించి, పరీక్షించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి తల్లి తన కోడలు కారణంగానే తన కుమారుడు మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరపనున్నట్లు ఎస్‌ఐ జి.రాజ్యలక్ష్మి తెలిపారు. మృతదేహాన్ని వేమూరు సీఐ వెంకటేశ్వర్లు, ఏఎస్‌ఐ రామయ్యలు పరిశీలించి శవ పంచనామా నిర్వహించి పోస్టు మార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

సమకాలీన సాంఘిక పద్యనాటకాలు అవసరం

- సినీ రచయిత సాయిమాధవ్
- బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారం ప్రదానం



పొన్నవోలు రామసుబ్బారెడ్డికి బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి పురస్కారం ప్రదానం

తెనాలి: నేటి సమకాలీన సాంఘిక పద్యనాటకాల రచనకు నాటక రచయితలు పూనుకోవాలని, వచ్చే ఏడాది ఆ విభాగంలో పరిషత్ పోటీలను నిర్వహించనున్నట్లు ప్రముఖ సినీరచయిత, కళల కాణాచి సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ సాయిమాధవ్ బుర్రా ప్రకటించారు. కళల కాణాచి- తెనాలి, వేదగంగోత్రి ఫౌండేషన్- విజయవాడ సంయుక్తంగా స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో ఐదు రోజులు పాటు నిర్వహించిన వీణా అవార్డ్స్-2023 తృతీయ జాతీయస్థాయి పద్యనాటక/సాంఘిక నాటికల పోటీల ముగింపు సభ మంగళవారం రాత్రి నిర్వహించారు. తెనాలికి చెందిన ప్రఖ్యాత రంగస్థల నటుడు బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారాన్ని నెల్లూరుకు చెందిన ప్రముఖ నటుడు, దర్శకుడు, గుణనిర్ణేత పొన్నవోలు రామసుబ్బారెడ్డికి ప్రదానం చేశారు. రూ.25 వేల నగదు, సన్మానపత్రం, జ్ఞాపికను రామసుబ్బారెడ్డి దంపతులకు బహూకరించి సత్కరించారు. సాయిమాధవ్ మాట్లాడుతూ ప్రదర్శన పారితోషికానికి అదనంగా ఒక్కో రచనకు రూ.25 వేలు అందజేయనున్నట్లు వెల్లడించారు. సభకు ప్రముఖ నాటక రంగ విశ్లేషకుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు అధ్యక్షత వహించారు. అవార్డు గ్రహీత పొన్నవోలు రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఏ మహానుభావుడి వల్ల నాటకరంగంలో ఉన్నతికి చేరుకున్నానో ఆ మహనీయుడు సుబ్రహ్మణ్యశాస్త్రి పురస్కారాన్ని అందుకోవటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ జ్యోతిష్య పండితుడు ప్రదీప్ జోషి, ఆర్‌ఎస్‌ఆర్ గ్రూప్స్ అధినేత శ్రీకాంత్‌రెడ్డి, సినీదర్శకులు వంశీ, రాజా వెన్నంరెడ్డి, సినీహీరో అశోక్ గల్లా, వీజీకే అండ్ వీవీఎల్ ఫౌండేషన్ కోశాధికారి తుమ్మల కిషోర్‌కుమార్, సినీనిర్మాత సోమినేని బాలకృష్ణ, సినీనటుడు ప్రదీప్, రంగస్థల నటి బుర్రా జయలక్ష్మి పాల్గొన్నారు. వేదగంగోత్రి డాక్టర్ వరప్రసాద్, కళల కాణాచి గౌరవ సలహాదారులు గోగినేని కేశవరావు, వేమూరి విజయభాస్కర్, వ్యవస్థాపక కార్యదర్శి షేక్ జానీబాషా, ప్రధాన కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, కోశాధికారి దేవరపల్లి భవాని, సహాయ కార్యదర్శులు గోపరాజు విజయ్, కొండముది రమేష్ పర్యవేక్షించారు.

ప్రభుత్వ పాఠశాలల స్థాయిని పెంచిన సీఎం వైఎస్ జగన్

- మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- ఐలవరం హైస్కూల్ విద్యార్థులకు కొరియా నుంచి వచ్చిన బహుమతులను ఆవిష్కరించిన మంత్రి



ఆంగ్లోపాధ్యాయుడు హరికృష్ణను సన్మానిస్తున్న మంత్రి నాగార్జున, పక్కన బౌడ చైర్మన్ దేవినేని

ఐలవరం(భట్టిప్రోలు): కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పెట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, ప్రభుత్వ పాఠశాలల స్థాయిని ముఖ్యమంత్రి పెంచారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను మంత్రి నాగార్జున బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆంగ్ల భాషపై ఉన్న ఫోబియాను విద్యార్థుల్లో తొలగించేందుకు కృషి చేస్తున్న ఆంగ్లోపాధ్యాయుడు పచ్చారు హరికృష్ణను మంత్రి అభినందించారు. ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు వర్చువల్, పెన్‌పాల్ విధానం ద్వారా విద్యార్థులలో జిజ్ఞాసను పెంపొందించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా చిన్న గ్రామంలో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం శుభపరిణామమన్నారు. గ్లోబల్ టీచర్ ప్రైజ్‌కు సంబంధించి టాప్ - 50 ఫైనల్ లిస్టులో రాష్ట్రం తరఫున హరికృష్ణ నిలవడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు హరికృష్ణను మంత్రి నాగార్జున ఘనంగా సన్మానించారు. సౌత్ కొరియా నుంచి హైస్కూల్‌కు వచ్చిన బాక్స్‌ను ఆవిష్కరించారు. ఆంగ్లోపాధ్యాయులు హరికృష్ణ మాట్లాడుతూ సౌత్ కొరియాకు చెందిన ఆంగ్లోపాధ్యాయురాలు సన్‌యంగ్‌కిమ్ ఐలవరం విద్యార్థులకు అక్కడి నుంచి బహుమతులు, చాక్లెట్లు, బిస్కెట్లు పంపారని తెలిపారు. ఆమె ఈ హైస్కూల్ విద్యార్థులతో గత మూడు సంవత్సరాలుగా ఆన్‌లైన్‌లో అనేక విషయాలను విదేశాలకు సంబంధించిన విషయాలను చర్చించుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్ని మెరుగుపరచుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్(బాడ) దేవినేని మల్లిఖార్జునరావు, సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, మాజీ ఎంపీపీ మాచర్ల హేమసుందరరావు, కో-ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, వీవర్స్ సొసైటీ అధ్యక్షుడు గట్టు శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు మాచర్ల మోహన్‌రావు, కనపర్తి నిరీక్షణరావు, కర్రా కిషోర్, పంచుమర్తి ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిశీలించిన జేసీ



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి, నారాకోడూరు గ్రామాల్లోని ప్రభుత్వ భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి బుధవారం పరిశీలించారు. వడ్లమూడి గ్రామంలోని సర్వే నెంబరు 310-2బిలోని 40.43 సెంట్ల ప్రభుత్వ పోరంబోకు భూమిని, నారాకోడూరు గ్రామ సర్వే నెంబరు 173-2లోని 7.36 ఎకరాల భూమిని మరియు సర్వే నెంబరు 365లోని 13.35 సెంట్ల భూమిని జాయింట్ కలెక్టర్ రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. వడ్లమూడి గ్రామ సర్వే నెంబర్లో ఎంఎస్‌ఎంఈ, పార్క్, ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల ఏర్పాటు కొరకు భూ పరిశీలన జరిగింది. నారాకోడూరు గ్రామంలో దేవాదాయశాఖ నుంచి సేకరించిన భూమి పేద ప్రజలకు ఇచ్చే ఇళ్ల స్థలములు మంజూరు విషయమై కోర్టు పరిధిలో ఉన్న అంశంను మరియు ప్రత్యామ్నాయంగా అదే గ్రామంలో గల కుంట పోరంబోకు భూమిని సైతంను అధికారుల బృందం పరిశీలించారు.

పోలీసు అనుమతి లేకుండా రాజకీయ ప్రచారాలు చేయొద్దు

- ట్రావెల్స్, డీజేల నిర్వాహకులు పోలీసుల అనుమతులు ఉంటేనే వెళ్లాలి
- రాజకీయ ప్రచారాలకు, ఊరేగింపులకు బాణాసంచా విక్రయాలు చేయరాదు
- సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ



మాట్లాడుతున్న డీఎస్పీ ఆదినారాయణ, పక్కన సీఐలు

సత్తెనపల్లి: జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలో ఏ రాజకీయ పార్టీ అయినా సరే ముందస్తు అనుమతి లేకుండా రాజకీయ ప్రచారాలు, సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదని సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ చెప్పారు. పట్టణంలోని తన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ పార్టీలు సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహిస్తే 30 పోలీస్ యాక్ట్‌ను ధిక్కరించినట్లేనని, ఇది ప్రజాశాంతికి భంగం కలిగించినట్లు అన్నారు. అన్ని రాజకీయపార్టీలు ముందస్తుగా అనుమతులు పొంది రాజకీయ ప్రచారాలు, సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించు కోవాలన్నారు. అనుమతి పొందిన రాజకీయపార్టీల నాయకులు తమ రాజకీయ ప్రచారాలు, సభలు, సమావేశాలు, ఊరేగింపుల సమయంలో ఏ విధమైన బాణాసంచా పేల్చడానికి అనుమతిలేదన్నారు. ముఖ్యంగా డీజేల నిర్వాహకులు రాజకీయపార్టీల నాయకులు పిలవగానే పోలీసుల అనుమతి ఉందో లేదో తెలుసుకోవాలన్నారు. సబ్ డివిజన్‌లో నేరాల నియంత్రణకు ప్రజలందరూ సహకరించాలని డీఎస్పీ ఆదినారాయణ కోరారు. సమావేశంలో సత్తెనపల్లి రూరల్ సీఐ పీ.ప్రేమయ్య, పెదకూరపాడు సీఐ కె.వీరాస్వామి, అమరావతి సీఐ ఏవీ బ్రహ్మం, నకరికల్లు ఎస్‌ఐ బాలకృష్ణ, తదితరులు ఉన్నారు.

లాడ్జిలో ఉరివేసుకొని యువతి మృతి

- అదేగదిలో రక్తపు మడుగులో యువకుడు
- కేసు నమోదు చేసి విచారిస్తున్న పోలీసులు



ఆయేషా బేగం మృతదేహాన్ని పరిశీలిస్తున్న పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు

పిడుగురాళ్ల: లాడ్జి గదిలో యువతి ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతి చెంది, యువకుడు రక్తపు మడుగులో ప్రాణాపాయ స్థితిలో ఉన్న సంఘటన పిడుగురాళ్ల పట్టణంలోని జానపాడు రోడ్డులోని పృథ్వీ లాడ్జిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని కుమ్మరిపాలెంలో ఎస్‌కే షబ్బీర్ మెకానిక్ వర్క్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. షబ్బీర్ వాళ్ల ఇంటిలో ఆయేషా బేగం తల్లిదండ్రులు అద్దెకు ఉంటున్నారు. అయితే షబ్బీర్‌కు వివాహమై భార్యతో కొంత కాలం నుంచి విడిపోయి ఉంటున్నాడు. వారికి ఒక చిన్నపాప ఉంది, భార్యభర్తల మనస్పర్ధల వలన విడిపోయి ఉంటున్నారు. ఈ క్రమంలోనే షబ్బీర్, ఆయేషాబేగం(21)కు పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఆయేషా పట్టణంలోని లాట్ మొబైల్ షాపులో పనిచేస్తూ సాయంత్రం ఇంటికి వచ్చేది. అయితే బుధవారం ఇంటికి రాకపోయేసరికి తండ్రి రెహమాన్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఫోన్ నెంబర్ ద్వారా ఉన్న ఆయేషాబేగం ఉంటున్న ప్లేస్‌ను ట్రేస్ చేసి తండ్రి రెహమాన్, బంధువులు, పోలీసులు వెళ్లి రూమ్ తలుపు కొట్టగా ఎవరు తీయకపోయేసరికి వెంటనే తలుపులు బద్ధలు కొట్టగా ఆయేషా ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతి చెందగా షబ్బీర్ రెండు చేతులు కోసుకొని రక్తపు మడుగులో ఉన్నాడు. వెంటనే పోలీసులు షబ్బీర్‌ను పట్టణంలోని ఓ ప్రైవేటు హాస్పటల్‌కు తరలించారు. పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు సంఘటన స్థలాన్ని, హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న షబ్బీర్‌ను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరిన్ని వివరాలు దర్యాప్తులో వెల్లడవుతాయని సీఐ పీవీ ఆంజనేయులు తెలియజేశారు.



చికిత్స పొందుతున్న షబ్బీర్

ఐఈఆర్పీ పోస్టులకు ఇంటర్వ్యూలు

గుంటూరు వెస్ట్: ఉమ్మడి గుంటూరు జిల్లా భవిత కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 15 ఎంఆర్ కేటగిరికి చెందిన ఐఈఆర్పీ పోస్టులకు జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఇంటర్వ్యూ నిర్వహించారు. మొత్తం 35 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. పాల్గొన్న వారందనీ జేసీతోపాటు జిల్లా అధికారులు ఇంటర్వ్యూ చేశారు.

28న అండర్-17 క్రికెట్ జట్ల ఎంపిక

నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరుజిల్లా అండర్-17 బాలబాలికల క్రికెట్ జట్ల ఎంపిక పోటీలను ఈనెల 28వ తేదీ శనివారం నరసరావుపేటలోని డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు బుధవారం తెలిపారు. క్రీడాకారులు 2007 జనవరి 1వతేదీ తరువాత జన్మించిన వారై ఉండాలని తెలిపారు. కేంద్రీయ విద్యాలయం, సీబీఎస్ఈ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు తమ పాఠశాల నుంచి ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లో మాత్రమే పాల్గొంటామనే అంగీకార పత్రం తీసుకరావాలని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తప్పనిసరిగా అకడమిక్ మానిటరింగ్ యాప్‌లో రిజిస్టర్ చేసుకొని 28వతేదీ ఉదయం 9గంటలకు హాజరు కావాలని తెలిపారు.

నేటి నుంచి ఈ-క్రాప్ ముసాయిదా జాబితాల ప్రదర్శన

నరసరావుపేట: జిల్లాలోని అన్నీ ఆర్‌బీకేలలో ఈనెల 26వ తేదీ నుంచి 29వరకు నాలుగురోజుల పాటు సామాజిక తనిఖీ కోసం ఈ-క్రాప్ ముసాయిదా జాబితాను ప్రదర్శించటం జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి బుధవారం వెల్లడించారు. ఖరీఫ్-2023లో 3,75,649 ఎకరాల్లో పంటసాగుపై ఈ-క్రాప్ పూర్తిచేయటం జరిగిందన్నారు. నాలుగురోజుల్లో గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ముసాయిదా జాబితాలోని రైతుల వివరాలను ఆర్‌బీకే సిబ్బంది చదివి వినిపిస్తారన్నారు. రైతులు ముసాయిదా జాబితాను పరిశీలించి అభ్యంతరాలు ఏమైనా ఉంటే సవరణ కోసం ఆర్‌బీకే కేంద్రాల్లోని వీఏఏ, వీహెచ్‌ఏ, వీఎస్‌ఏలను సంప్రదించి అభ్యంతరాలను రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇదే ఆఖరి అవకాశమని, తుది జాబితా ప్రదర్శన తర్వాత ఎటువంటి మార్పులు, చేర్పులు ఉండజాలవని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా చంద్రమౌళీశ్వరస్వామి తెప్పోత్సవం




నర్సింగపాడులో మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి వారి తెప్పోత్సవం

వేలాదిగా పాల్గొన్న భక్తజనం

నకరికల్లు: మండలంలోని నర్సింగపాడులో వేంచేసి ఉన్న గంగా అన్నపూర్ణా సమేత మరకతలింగ చంద్రమౌళీశ్వర స్వామి వారి ఆలయ కోనేటిలో స్వామి వారి తెప్పోత్సవం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివిధప్రాంతాల నుంచి తెప్పించిన పలు రకాలపూలతో అలంకరించిన హంస వాహనంపై కోనేటిలో స్వామివారు విహరిస్తుండగా శివనామస్మరణతో భక్తులు మైమరిచిపోయారు. పలు గ్రామాల నుంచి తెప్పోత్సవం తిలకించేందుకు వచ్చిన భక్తజనంతో ఆలయం, కోనేటి ప్రాంగణం కిక్కిరిసింది. దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం స్వామివారి తెప్పోత్సవం మేళతాళాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధానఅర్చకుడు పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విశేషపూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివారు హంసవాహనంపై కొలువు దీరగా కోనేటిలో భక్తులు పూలజల్లులు కురిపించారు. పసుమర్తి వెంకట శివనాగమల్లేశ్వరరావు, శ్రీలక్ష్మి, బొగ్గవరపు కృష్ణప్రసాద్, భాగ్యలక్ష్మిల సహకారంతో తెప్పోత్సవం జరిపించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ ఎ.బాలకృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

అమరవీరుల కుటుంబాలకు ధైర్యం

అన్నివేళల్లో పోలీస్‌శాఖ అండ ఉంటుందంటూ ఉన్నతాధికారుల హామీ



గౌరీశంకర్ కుటుంబ సభ్యులకు బహుమతి అందిస్తున్న డీఎస్పీ, సీఐ



కానిస్టేబుల్ విగ్రహానికి నివాళులు

నగరంపాలెం: పోలీసు అమరవీరుల దినోత్సవంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అమరవీరుల వారోత్సవాలు జరుగుతున్నాయి. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్నారు. దీనిలో భాగంగా సబ్ డివిజన్ పరిధిలో ఉంటున్న పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెబుతున్నారు. డీఎస్పీ స్థాయి అధికారి నుంచి సీఐలు, ఎస్‌ఐలు పోలీస్ సిబ్బంది బుధవారం వారి ఇళ్లకు వెళ్లారు. ఇంటి పెద్ద దిక్కు ప్రాణం కోల్పోయిన పరిస్థితులపై వాకబు చేశారు. ప్రస్తుతం ఆయా కుటుంబాల్లోని పిల్లలు ఏం చదువుతున్నారు, కుటుంబ ఆర్థిక పరిస్థితులపై ఆరాతీశారు. అనంతరం వారికి మరింత మనో ధైర్యం అందించారు. భవిష్యత్‌లో కుటుంబ సభ్యులకు ఎటువంటి సహాయ సహకారాలు అవసరమైనా జిల్లా పోలీస్ శాఖ అండగా / తోడుగా ఉంటుందని భరోసా కల్పించారు. పిల్లలను ఉన్నతంగా చదివించి, గొప్ప ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని పోలీస్ అధికారులు ఆకాంక్షించారు. వట్టిచెరుకూరు మండలం కాట్రపాడులోని కానిస్టేబుల్ గౌరీశంకర్ విగ్రహానికి దక్షిణ డీఎస్పీ మహబూబ్ బాషా, ప్రత్తిపాడు పీఎస్ సీఐ ఎంవీ సుబ్బారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామస్తులకు మిఠాయిలు పంపిణీ చేయగా, గౌరీశంకర్ కుటుంబ సభ్యులకు బహుమతి అందించారు. నగరంపాలెం పీఎస్ పరిధిలోని అమరులైన ఓ పోలీస్ కుటుంబాన్ని ఎస్‌ఐ రోజాలత సందర్శించి, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

యార్డుకు 14,283 బస్తాల మిర్చి రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 14,283 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 13,526 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.11,500 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 24,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.12,000 నుంచి రూ.21,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.14,000 నుంచి 26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 7,797 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.